డిఇఒగా తిరుమల చైతన్య

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా విద్యాశాఖాధికారిగా తిరుమల చైతన్యను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు డిఇఒగా పనిచేసిన గార పగడాలమ్మను టెక్కలి డిప్యూటీ డిఇఒగా బదిలీ చేశారు. తిరుమల చైతన్య ప్రస్తుతం వమరవల్లి డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. గతంలో సమగ్ర శిక్ష ఎపిసిగా, ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహించారు. పగడాలమ్మ బదిలీ వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్ సమయంలో జిల్లాకు చెందిన ఒక ముఖ్య నేతతో పాటు పక్క జిల్లాకు చెందిన కీలక నేత సిఫార్సులను పక్కన పెట్టడం వల్లే బదిలీ వేటు పడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

మూలపేట పోర్టు అభివృద్ధికి మూలస్తంభం

"భావనపాడుకు సమీపంలో ఉన్న మూలపేట గ్రామం ఇక మూలనున్న పేట కాదు. అభివృద్ధికి మూలస్తంభం. మూలపేట, విష్ణుచక్రం గ్రామాలు రాబోయే రోజుల్లో రానున్న తరాలకు చెన్నై, ముంబై కానున్నాయి"

- పోర్టు నిర్మాణంతో మారనున్న జిల్లా రూపురేఖలు
- 35 వేల మందికి ఉద్యోగావకాశాలు
- జూన్‌లో ఉద్దానం పథకం
- ఆగస్టులో వంశధార, నాగావళి అనుసంధాన ప్రాజెక్టు జాతికి అంకితం
- ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, నౌపడ, సంతబొమ్మాళి

మూలపేటలో 24 మిలియన్ టన్నుల సామర్థ్యంతో, నాలుగు బెర్తులతో పోర్టు నిర్మించబోతున్నామని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద రూ.4,362 కోట్లతో నిర్మించనున్న పోర్టుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నౌపడలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాబోయే రోజుల్లో ఇక్కడ ట్రాఫిక్ పెరిగి ఈ పోర్టు సామర్థ్యం వంద మిలియన్ టన్నులకు చేరే రోజు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోర్టు రోడ్డు, రైల్వే మార్గాలను అనుసంధానించడంతో పాటు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న గొట్టాబ్యారేజీ నుంచి ఒక పైపులైను వేసి 0.5 ఎంఎల్‌డి కెపాసిటీతో నీటి సరఫరా ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.

35 వేల మందికి ఉద్యోగావకాశాలు

పోర్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈరోజు శంకుస్థాపన చేసిన మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, గొట్టాబ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకం, ఆఫ్‌షోర్ పున: ప్రారంభం పనులతో జిల్లా ముఖచిత్రాన్ని మార్చబోతున్నాయని చెప్పారు. జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరం ఉందన్నారు. ఒక పోర్టు గానీ ఫిషింగ్ హార్బర్ గానీ కనీసం ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మించినా చెన్నై, ముంబై నగరం మాదిరిగా అభివృద్ధి బాటన పడుతుందని తెలిసినా, గత పాలకులెవరూ ఆ దిశగా అడుగులు వేయలేదన్నారు.

పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ గతంలో అనేక ప్రభుత్వాలు పాలించినా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ మూలపేట పోర్టుతో జిల్లా అభివృద్ధిబాటలో పయనించగలదని చెప్పారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో మత్స్యకారుల వలసల నివారణ సాధ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు.

సిఎం పర్యటన సాగింది ఇలా...

ఉదయం 10.15 గంటలు : మూలపేటలోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు.
10.35 : గంగపూజ, పోర్టుకు శంకుస్థాపన
10.45 : పైలాన్ ఆవిష్కరణ
10.55 : నౌపడలో సభా ప్రాంగణానికి పయనం
11.08 : సభా ప్రాంగణానికి చేరుకున్నారు
11.14 : శంకుస్థాపన శిలాఫలకాలు ఆవిష్కరణ
11.07 : సభా వేదిక పైకి వచ్చారు
11.42 : సిఎం ప్రసంగం ప్రారంభం
12.20 : ప్రసంగం ముగింపు
12.55 : మంత్రులు, స్థానిక నాయకులతో భేటీ
1.25 : హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు
1.30 : హెలీకాప్టర్‌లో విశాఖకు పయనం

సిఎంకు ఘన స్వాగతం

జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, విద్యాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, అంబటి రాంబాబు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, వరుదు కళ్యాణి, నర్తు రామారావు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, కళావతి, కంబాల జోగులు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఉన్నారు.

ఆగస్టులో వంశధార, నాగావళి అనుసంధాన ప్రాజెక్టు అంకితం

వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో రూ.12 కోట్లతో చేపట్టనున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు అదనంగా మరో రూ.85 కోట్లను కేటాయించి, దాన్ని ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. నేరడి బ్యారేజీ నిర్మాణానికి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రైతులకు మంచి జరగాలన్న ఉద్దేశంతో రూ.176 కోట్లతో గొట్టాబ్యారేజీపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులను పూర్తి చేసి ఆగస్టులో జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

జూన్‌లో ఉద్దానం రక్షిత మంచినీటి పథకం

కిడ్నీ సమస్యకు కలుషిత నీరు కూడా కారణం కావడంతో ఉపరితల జలాలను అందించేందుకు రూ.700 కోట్లతో మంచినీటి పథకాన్ని నిర్మిస్తున్నామని, జూన్‌లో జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పాతపట్నం నియోజకవర్గంలోని మూడు మండలాలకు రూ.265 కోట్లతో ఉద్దానం నీటి పథకాన్ని విస్తరించేందుకు జూన్‌లో పునాదిరాయి వేస్తామని తెలిపారు.

తీవ్ర ఉక్కపోత, దాహంతో అవస్థలు

సిఎం సభకు భారీగా జనాన్ని తరలించిన అధికారులు, వైసిపి నాయకులు ఆ మేరకు ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. సభా ప్రాంగణం చిన్నది కావడంతో ఉదయం 11 గంటల తర్వాత పోలీసులు సభా ప్రాంగణంలోకి అనుమతించలేదు. దీంతో గేట్లు వద్ద ఆగిపోయారు. పలువురు గేట్లు దూకి సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. గ్యాలరీలు ప్రజలతో కిక్కిరిసిపోయి మరోవైపు ఎండ వేడిమి, ఉక్కపోత తీవ్రంగా ఉండడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. తీవ్రమైన ఎండతో ఉక్కపోతకు గురై సిఎం ప్రసంగం అవుతుండగానే మధ్యలోనే కొందరు బారికేడ్లను తొలగించి బయటకు వెళ్లిపోయారు. పోలీసులు వీరిని వారించే ప్రయత్నం చేసినా మరోవైపు నుంచి గేట్లు తెరుచుకుని బయటకు వచ్చేశారు. ఎండ తీవ్రత తట్టుకోలేక చాలామంది సభా ప్రాంగణానికి దూరంగా ఉన్న చెట్ల నీడను ఆశ్రయించారు. తాగునీటి సదుపాయం లేక దాహంతో అలమటించారు. తాగునీటిని సభ వెలుపల ఏర్పాటు చేయడంతో గ్యాలరీలో ఉన్న ప్రజలు దాహంతో అలమటించారు. మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేసినా నాలుగైదు గ్యాలరీలో ఉన్న ప్రజలకు పంపిణీ చేశారు. సభ పూర్తయిన తర్వాత భోజన ఏర్పాట్లు కూడా సరిగా చేయలేదు. వాహనాల్లో కొద్దిమేర వచ్చిన ఆహార పొట్లాల కోసం జనం ఎగబడ్డారు.

గంగ పూజ చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

పోలీసుల అత్యుత్సాహం

పోలీసుల మితిమీరిన ఆంక్షలతో జనం ఇబ్బందులు పడ్డారు. సాధారణ ప్రయాణికులను సైతం టెక్కలి-నౌపడ మార్గంలో అనుమతించలేదు. బస్సులు, ఆటోలను ఆపేడయంతో ఎండలోనే నడుచుకుంటూ అవస్థలు పడ్డారు. చివరకు మీడియా పాసులున్న విలేకరులను సైతం అడ్డుకున్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పోర్టుతో పాటు సభా ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను సిఎం ఆవిష్కరించారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం తీరంలో రూ.365.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌కు, గొట్టాబ్యారేజీ నుంచి హిరమండలం రిజర్వాయర్‌కు రూ.176.35 కోట్లతో వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, రూ.852 కోట్ల వ్యయంతో మహేంద్రతనయ ప్రాజెక్టు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. సభలో కళింగ, తూర్పు కార్పొరేషన్ అధ్యక్షులు పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ శ్రీనుని ఆశీర్వదించండి

టెక్కలి నియోజక వర్గంలో ఎప్పుడూ కన్ఫ్యూజన్ ఉండకూడదని, అలా ఉంటే పార్టీకి నష్టం వాటిల్లుతుందని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ శ్రీనుని మీ చేతుల్లో పెడుతున్నానని, అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి శ్రీను సంతబొమ్మాళి మండలంలో 94 గ్రామాలకు మంచినీటి కోసం రూ.70 కోట్లు ఖర్చయ్యే సిపిడబ్ల్యు స్కీమ్ కోసం శ్రీను అడిగారని, ఆ గ్రామాలకు తాగునీటి సౌకర్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీనిచ్చారు.

పలువురు నాయకుల ముందస్తు అరెస్టులు

ముఖ్యమంత్రి పర్యటనకు ఆటంకం కల్పిస్తారన్న సమాచారంతో పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావు, కె.నారంనాయుడు, జె.సుందరరావు, ఎస్.సింహాచలం, జె.తాతమ్మ, ఎం.ఎర్రయ్య, జె.చిరంజీవి, ఎం.సూరిని నౌపడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు పలువురు నేర చరిత్ర ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని నౌపడ నుంచి నందిగాం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిఎం పర్యటన ముగిసిన తర్వాత విడిచిపెట్టారు.

ట్రాఫిక్ ఇబ్బందులు

జిల్లా నలుమూలల నుంచి 245 బస్సులు ఏర్పాటు చేసి ప్రజలను సభా ప్రాంగణానికి తరలించారు. ఒకేసారి వాహనాలన్నీ సభా ప్రాంగణానికి రావడంతో పార్కింగ్ సమస్య తలెత్తింది. సభా ప్రాంగణానికి సుమారు కిలోమీటరు దూరం నుంచి బస్సులు, వాహనాలు నిలిపివేయడంతో ప్రజలు ఎండలోనే నడుచుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఒకవైపు నుంచి వచ్చిన వాహనాలను మరోవైపు పార్కింగ్ చేయడంతో సభ అనంతరం అరగంటసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్లపై ఆహార పొట్లాలను పంపిణీ చేయడంతో ట్రాఫిక్ మరింత నిలిచిపోయింది. చివరకు పోలీసులు అతి కష్టంపై ట్రాఫిక్ క్లియర్ చేశారు.

బహిరంగ సభకు హాజరైన ప్రజలు

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, యుబి కార్మికులు

యుబి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

రణస్థలం : యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులందరినీ విధుల్లోకి తీసుకుని పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్మికులు మండలంలోని బంటుపల్లి కూడలిలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం, భూములు ఇచ్చిన స్థానికులైన కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించకుండా అర్ధాంతరంగా నిలుపుదల చేసిందని తెలిపారు. ఎక్సైజ్ శాఖ యబి ఉత్పత్తులకు రెన్యువల్ చేయలేదని, అందుకే కార్మికులందరికీ విధుల్లోకి తీసుకోవడం లేదని యాజమాన్యం చెప్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన బినామీ మద్యం కంపెనీలకు ఆర్డర్లు ఇస్తూ యుబి ఉత్పత్తులైన కింగ్‌ఫిషర్‌కు డిమాండ్ ఉన్నా ఆర్డర్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం కలిసి 600 మంది కార్మిక కుటుంబాలను రోడ్డున పడేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. జెసిఎల్ ఆదేశాలను యుబి యాజమాన్యం లెక్కచేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికులందరికీ పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, నాయకులు పి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, పి.మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస, సోంపేట

దేశ ప్రజల ఆకాంక్ష కోసం పోరాటం సాగించిన మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు యువతకు పిలుపునిచ్చారు. వారి అడుగుజాడల్లో నడిస్తే భవితకు బంగారు బాటలు వేసుకోవచ్చని చెప్పారు. జిల్లా పర్యటనకు బుధవారం వచ్చిన ఆయన గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా నగరంలోని డేఅండ్‌నైట్ కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న, కణితి విశ్వనాథం విశాఖలో తనకు విద్యార్థి దశలోనే పరిచయమయ్యారని తెలిపారు. వారితో కలిసి జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్నానని గుర్తుచేసుకున్నారు. నీతి, నిజాయతీ, నమ్మిన సిద్ధాంతాలతో ఆదర్శంగా నిలిచే వారు ప్రజల్లో చిరస్థాయిలో ఉండిపోతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తదితరులు పాల్గొన్నారు.

పలాసలోని టిడిపి కార్యాలయంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి, మారుతీ షోరూం సమీపంలో లచ్చన్న విగ్రహానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ ప్రెసిడెన్సీ వరకు జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జైకిసాన్ ఉద్యమాన్ని ముందుండి నడిపించారని గుర్తుచేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కృష్ణాపురంలో లచ్చన్న విగ్రహానికి శ్రీశయన సంఘం రాష్ట్ర నాయకులు బూరెల కృష్ణంరాజు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్ తదితరులు నివాళ్లర్పించారు. మందస మండలం బాలిగాం, హరిపురం కూడలి వద్ద లచ్చన్న వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. సోంపేట మండలంలోని పలాసపురంలో లచ్చన్న చిత్రపటానికి జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ జోగారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

లచ్చన్న చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న వెంకయ్య నాయుడు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

బిజెపిని గద్దె దించాలి

కంచిలి : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎస్.నారాయణస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ చేపట్టిన ప్రచార భేరిని కంచిలిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల పన్నులతో నిర్మించిన ప్రభుత్వరంగ పరిశ్రమలు, ఓడరేవులు, బ్యాంకులు, చివరకు వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. మోడీ అండదండలతో అదానీ ఏవిధంగా ప్రపంచాన్ని మోసం చేసి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిండెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని తెలిపారు. అయినా ఆదానీపై విచారణకు అంగీకరించకుండా బిజెపి ప్రభుత్వం వెనకేసుకొస్తోందని విమర్శించారు. పైగా మరింత వేగంగా దేశంలోని అడవులు, భూములు, విద్యుత్ ప్రాజెక్టులు, గనులను అక్రమంగా కట్టబెడుతోందని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. గ్రామీణ పేదలకు జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు రక్షణ లేకపోగా దాడులు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయలేని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన అధికార వైసిపి నోరెత్తకుండా మోడీ ప్రభుత్వానికి సలామ్‌లు చేస్తోందన్నారు. మూలపేట పోర్టును అదానీకి అప్పగించడానికి జగన్ పూనుకుంటున్నారని చెప్పారు. గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానీకి అప్పగించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను అదానీప్రదేశ్‌గా మారుస్తున్నారని విమర్శించారు. విభజన హామీల అమలు గురించి అడిగే ధైర్యం గానీ, నిలదీసే దమ్ము గానీ జగన్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, పి.కృష్ణ, జి.రఘు, సిపిఐ జె.తరణి తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలన పోవాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్రంలో సైకో పాలన పోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కట్యాచార్యులపేటలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నిత్యావసర ధరలు, ఆర్‌టిసి, విద్యుత్ తదితర ఛార్జీల పెరుగుదల, వైసిపి ప్రభుత్వ పనితీరును వివరించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి ముందస్తుగా చంద్రబాబు నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్ని అవమానాలకు గురిచేసినా ప్రజల పక్షాన పోరాడుతున్న నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఎన్నికల ముందు ఎన్నో వాగ్ధానాలు ఇచ్చి ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలు కోలుకోలేని విధంగా పలురకాల చెత్త పన్నులతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దెబ్బతీశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించి, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. టిడిపి అధికారంలోకొస్తే అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రం పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు తమ్మినేని సుజాత, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, టిడిపి జిల్లా కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, సనపల చెల్లంనాయుడు, బెండి శ్రీనివాసరావు, నేతింటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూన రవికుమార్

అధికారికంగా 'బొడ్డేపల్లి' శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మాజీ ఎంపీ, కళింగ నేత కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆరుసార్లు ఎంపీగా ఎన్నికై, జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పలుమార్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన సిఎం ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో వంద రోజుల పాటు ఘనంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం జిఒ ఆర్‌టి నంబరు 734ను విడుదల చేసింది.

రాజగోపాలరావును ఒక పార్టీకి చెందిన నాయకునిగా కాకుండా, జిల్లా అభివృద్ధి ప్రదాతగా చూడాలని స్పీకర్ తమ్మినేని సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించి కేంద్ర ప్రభుత్వం వద్ద వెనుకబడిన జిల్లాగా గుర్తించి నిధుల మంజూరుకు కృషి చేశారని గుర్తుచేశారు. ఆమదాలవలసలో సహకార చక్కెర కర్మాగారాన్ని, నైర, రాగోలు, ఆమదాలవలసలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయించడంలో ఆయన పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి రాజగోపాలరావు కృషి చేశారని తెలిపారు. మాజీ ప్రధాని కీ.శే ఇందిరాగాంధీ సహకారంతో కళింగ సామాజిక తరగతిని బిసి-ఎలో చేర్చేలా దోహదపడ్డారని పేర్కొన్నారు. రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేలా చొరవ చూపిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మరిన్ని వార్తల కోసం

సిఎం టూర్ ఫొటో ఫీచర్

epaper.prajasakti.com

CHANGE OF NAME

I Smt. **NANDIGAM VIJAYA LAKSHMI,** W/o.Sri. NANDIGAM MALLESWARA RAO,residing at TEKKALI Vill., Post & Mandal, SRIKAKULAM Dist., ANDHRA PRADESH. have changed my name from **MAHALAKSHMI NANDIGAM to NANDIGAM VIJAYA LAKSHMI** vide Affidavit dated **18-04-2023**, sworn before Notary (within in the jurisdiction of JCJ's Court, Tekkali).

MISSING 10TH CERTIFICATE

Missing 10th class certificate at **KOTTURU BUS STAND** dated 06-04-2023**LOTHUGEDDA HASITHA,** D/o Ananda Rao, **St.ANN'S CONVENT SCHOOL,** Pathapatnam, if any body found Please inform **KOTTURU POLICE STATION** or please contact.

9392954892

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఒక్క ఛాన్స్ ఫలితం 20 ఏళ్లు వెనక్కి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రజలను కోరి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని, ఒక్క చాన్స్ ఫలితం 20 ఏళ్లు రాష్ట్రం వెనక్కి వెళ్లిపోయిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ధ్వజమెత్తారు. మందస మండలం బాహడపల్లిలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం ఒక్క ఛాన్స్ ఫలితం అన్ని రంగాల్లో తిరోగమనంగా మారిందన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కియా, ఇసుజు, హీరో మోటోకార్ప్, అశోక్ లేలెండ్, అపోలో, డిక్సన్, సెల్కాన్, టిసియెల్ లాంటి వందల పరిశ్రమలను తీసుకువచ్చిన ఘనత చంద్రబాబునాయుడు అని అన్నారు. కార్యక్రమంలో బి.దుర్యోధన, మద్దిల తాతారావు, నాయకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అనురాధ

నిద్దాంలో ఇంటింటా సర్వే

జి.సిగడాం : మండలంలోని నిద్దాంలో క్షయ వ్యాధి నివారణ అధికారి, అడిషనల్ డిఎంహెచ్ఒ ఎన్.అనురాధ ఆధ్వర్యాన వైద్య సిబ్బంది బుధవారం ఇంటింట సర్వే నిర్వహించారు. కుష్టు వ్యాధులు, తదితర అంటు వ్యాధులు ప్రబలుతుండడంతో ఈ సర్వే చేపడుతున్నామని తెలిపారు. వ్యాధి లక్షణాలను గుర్తిస్తూ... వైద్య పరీక్షలు నిర్వహించామని అన్నారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో డిఎన్ఒ ప్రవీణ్, డిబిఎంఒ సాంబమూర్తి, డిపిఎం పాపినాయుడు, మండల హెల్త్ అధికారిని హరితశ్రీ, జస్వంత్, ఫిజియో థెరపీ రవిచంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ పేడాడ సత్యరాజు, భాస్కరరావు, రమాదేవి పిఎస్‌సి అధికారి ఉమ, సర్పంచ్ మీసాల రవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్

'బొడ్డేపల్లి' శత జయంతి ఉత్సవాలపై హర్షం

మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ పార్లమెంటు సభ్యులు బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంత్యుత్సవాలు అధికారికంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం జిఒ నంబరు 734 విడుదల చేయడం హర్షణీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్ అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తాత రాజగోపాలరావు వంద రోజుల పాటు ఉత్సవాలు అధికారికంగా ప్రభుత్వం నిర్వహించడానికి నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర వెలకట్టలేనిదన్నారు. వంశధార రిజర్వాయరు, సహకార చక్కెర కర్మాగారం, నైర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. ఈయనతో పాటు సువ్వారి నేతాజీ, బొడ్డేపల్లి కృష్ణారావు ఉన్నారు.

పైపులైన్‌ను మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

కొంచాడలో దాహం కేకలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కొంచాడలో పది రోజులుగా తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు లేకపోవడంతో సుదూర ప్రాంతాల్లోని పొలాల్లో ఉన్న నేలబావులకు వెళ్లి తీసుకురావాల్సి వస్తుందని వారంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వేసవి తీవ్రత ఎక్కువుగా ఉండడంతో దూరప్రాంతాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తరుచుగా పైపులైన్లు మరమ్మతులకు గురవుతుండడంతో వాటిని పరిష్కరించడంలో అధికారులు చేతులెత్తేస్తున్నారని, వాటికి తక్షణమే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి శాశ్వతంగా పరిష్కారం చేసి తాగునీరును సరఫరా చేయాలని కోరుతున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

శ్రీకాకుళం అర్బన్ : ప్రచారభేరి నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునేందుకు బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల మండల కేంద్రంలో బుధవారం పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజల ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులను, ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగ పరిశ్రమలను, వాడరేవులను, అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాధత్తం చేస్తుందని విమర్శించారు. దేశంలోని అడవులు, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, గనులను కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతుందన్నారు. భావనపాడు పోర్టును అదానికి అప్పగించడానికి జగన్ పూనుకుంటున్నారని అన్నారు. విభజన హామీల అమలు గురించి అడిగే ధైర్యం సిఎం జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. బిజెపి, వైసిపి పాలనకు భిన్నంగా కేరళ వామపక్ష ప్రభుత్వం ఆదర్శవంతంగా నడుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎల్.రాము గోవింద్, ఎన్.రమణ, జి.శ్రీను పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : దేశవ్యాప్త ప్రచార భేరిలో భాగంగా ఆరో రోజున నగరంలో పాత బస్టాండ్, చేపల బజార్, మేదరవీధి, దమ్మలవీధుల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వామపక్ష పోరాటాలకు మద్దతు ఇవ్వండి, దేశ అభివృద్ధి కోసం సహకరించండి అంటూ నినాదాలు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టె చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా, కార్మికవర్గ సమస్యలు సమస్యలు గాలికొదిలేశారని విమర్శించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు అల్లు సత్యనారాయణ, వెంకటరావు పాణిగ్రహి, ఎ.సోమశేఖర్, ఎం.కోదండరావు, శ్రీదేవి పాణిగ్రహి, పి.ప్రభావతి, ఆర్.కన్నయ్య, పి.ప్రసాద్, ఎస్.శ్రీనివాసులు, అప్పారావు, జగదీష్, శ్రీను పాల్గొన్నారు.

కొత్తూరు : సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తేజేశ్వరరావు

కొత్తూరు : సిపిఎం, సిపిఐ ప్రచార భేరి కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కమిటీ నాయకులు సిర్ల ప్రసాద్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ మేరకు నాలుగు రోడ్ల కూడలి వద్ద సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేపట్టారు. సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, తెల్లన్న, దుర్గారావు, రామారావు, ప్రకాష్, సంజీవ్, రాము, కృష్ణలు పాల్గొన్నారు.

పొందూరు : ఖాదీ కండువాను వేస్తున్న వెంకటరమణ

ఖాదీకి భౌగోళిక గుర్తింపునకు సహకరించాలి

ప్రజాశక్తి- పొందూరు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పొందూరు సన్నఖాదీ వస్త్రాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపును (జిఐ) పొందడానికి తగిన సహాయ, సహకారాలను అందించాలని ఏఫ్‌కేకే సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు గుంటుకు కామేశ్వరప్రసాద్, డి.వెంకటరమణలు కోరారు. బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేని మాజీ రాష్ట్రపతి వెంకయ్యానాయుడును ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇంట్లో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌తో కలిసి ఖాదీరంగం ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. ఇటీవల పొందూరు ఖాదీకి ఎంతో విశిష్టత ఉందని, దీనికి భౌగోళిక గుర్తింపు (జిఐ)ను ఇవ్వాలంని ఎంపీ పార్లమెంట్‌లో ప్రస్తావించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసినట్లు ఆయనకు తెలియజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ పొందూరు ఖాదీ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఈ వస్త్రాలను తాను వినియోగిస్తానని అన్నారు. పొందూరు ఖాదీకి ప్రత్యేకంగా భౌగోళిక గుర్తింపును మంజూరు చేసేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని హామీనిచ్చారు. అలాగే మండలానికి చెందిన జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, లోలుగు వెంకట్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు.

సాదర స్వాగతం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకటయ్యానాయుడు చేరుకున్నారు. ఈయనకు బిజెపి నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడ నుంచి రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అనురాగ నిలయాన్ని సందర్శించారు. అక్కడున్న విద్యార్థులతో, వృద్ధులతో మాట్లాడారు. ఆయనకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు పి.ఎల్.ఎన్.రాజు, పి.వైకుంఠరావు, పి.శ్రీకాంత్, డాక్టర్ కె.సుధీర్, యు.వీర్రాజు, ఎం.కళ్యాణ్‌చక్రవర్తి, అంధవరపు ప్రసాద్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అక్కడి నుంచి నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఎంఈప రామ్మోహన్ నాయుడు ఇంట తేనేటి విందుకు హాజరయ్యారు. మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులు కూడా కలిశారు.

శిష్టకరణాలను ఒబిసిలోకి చేర్చాలని వినతి

విద్య, ఉద్యోగ, రాజకీయంగా వెనుకబడిన శిష్టకారణాలను కేంద్ర బిసి జాబితాలో చేర్పించేందుకు సహకరించాలని ఎపి శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు కోరారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు బుధవారం జిల్లాలో పర్యటించారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయంలో శిష్టకరణ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి డబ్బీరు శ్రీనివాసరావు (వాసు), కోశాధికారి ఉరిటి కిరణ్, పట్టణ ఉపాధ్యక్షులు పెదపెంకి శ్రీరామ్ కుమార్, బోగెల ఉమామహేశ్వరరావు, రాజకీయ జాతీయ ప్రతినిధి నౌపడ సత్యనారాయణ ఉన్నారు.

రణస్థలం రూరల్ : పుష్పగుచ్ఛం అందజేస్తున్న 'ఎన్ఇఆర్'

వెంకయ్యనాయుడును కలిసిన 'ఎన్ఇఆర్'

రణస్థలం రూరల్: జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడును ఎచ్చెర్ల బిజెపి కన్వీనర్, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు ఘన స్వాగతం పలికారు. బుధవారం రణస్థలం విచ్చేసిన వెంకయ్యానాయుడును ఎన్ఇఆర్ స్కూల్ కూడలి వద్ద ఈశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ తేజబాబు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్కూల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను ఉత్తరాంధ్ర విద్యార్థులకు చేరువ చేయడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థను నెలకొల్పినందుకు ఈశ్వరరావును ప్రశంసించారు.

ప్రిన్సిపాల్‌కు కవర్‌లో పెట్టి నగదు అందిస్తున్న సిబ్బంది

నలుగురికీ 'ఆదర్శంగా'...

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాల వసతిగృహంలో పనిచేస్తున్న ఎస్.అరుణమ్మ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందింది. దీంతో వారి కుటుంబానికి చేయూత అందించేందుకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సిద్ధమయ్యారు. అందులో భాగంగా జిల్లాలోని మిగతా ఆదర్శ పాఠశాలలకు సమాచారం అందించారు. దీనికి స్పందించిన ఇచ్ఛాపురం ఆదర్శ పాఠశాల రూ.10 వేలు, కంచిలి మండలం ఎం.ఎస్.పల్లి ఆదర్శ పాఠశాల రూ.18,300, సోంపేట ఆదర్శ పాఠశాల రూ.10 వేలు, పాతపట్నం ఆదర్శ పాఠశాల రూ.12,600లను బుధవారం రాజపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లాలోని మిగతా ఆదర్శ పాఠశాలలూ నగదు అందించే ఆలోచనలో ఉన్నాయని, మొత్తం సొమ్మును మరో రెండు మూడు రోజుల్లో అరుణమ్మ కుటుంబ సభ్యులకు అందిస్తామని తెలిపారు.

గ్రామసభ నిర్వహిస్తున్న సర్పంచ్ అమ్మాయమ్మ

వి.ఆర్ గూడెంలో గ్రామసభ

పొందూరు: మండలంలోని వి.ఆర్.గూడెంలో సర్పంచ్ సువ్వారి అమ్మాయమ్మ అధ్యతన పంచాయతీ గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు కల్పన, వీధి దీపాలు, రహదారులు, పారిశుధ్యం వంటి అంశాలతో పాటు ఈ ఏడాది చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఉపసర్పంచ్ కళ్యాణి, మాజీ సర్పంచ్ రాములు, గ్రామపెద్దలు సువ్వారి మధు, సువ్వారి గోవిందరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు

బూర్జ : మండలంలోని మామిడివలసలో ఉన్న ఆర్అండ్ బికి చెందిన రెండు సిరిసిం చెట్లను సంతకవిటి మండలం గరికిపాడుకు చెందిన మీసాల రామకృష్ణ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించిన ట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు తహశీల్దార్ రమణారావు ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామ సచివాలయం తీర్మానం తీసుకున్నార ని చెట్లను నరికారని వెల్లడించారు. అప్పటికప్పుడే తీర్మానం చేయడం ఏమటని గ్రామానికి చెందిన సాకేటి శ్రీనివాస రావు ప్రశ్నించారు. మూడు చెట్లు నరికారని, కానీ తహశీల్దార్ ఒక్క చెట్టుకే తీర్మానం చేశారని చెబుతున్నారని అన్నారు. ఆర్అండ్‌బి అధికారులు పర్యవేక్షించాలని కోరారు.

ముందస్తు అడ్మిషన్లు సరికాదు

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి

పలాస : చదువుల పేరుతో ముందస్తు అక్రమ అడ్మిషన్ చేస్తూ వ్యాపారం చేస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి డిమాండ్ చేశారు. పలాస కాలేజీలో ఎఐఎస్ఎఫ్ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందునే విద్యార్థుల తల్లిదండ్రులను మాయమాటలు చెప్పి టెక్నో, ఈ టెక్నో, ఐకాన్ జెడ్ఎఫ్‌టిబి, కోస్పార్క్ వంటి కోర్సుల పేర్లు చెప్పి అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఇప్పటి నుంటే అడ్మిషన్ చేస్తూ తరగతులను నిర్వహిస్తున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంసెట్ పేరుతో వేల రూపాయల వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ చొరవ తీసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు చందు పవన్, నాయకులు నిఖిల్, దివాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవి

క్రైమ్ కార్నర్

మత్స్యకార యువకుడు మృతి

రమణ మృతదేహం

శ్రీకాకుళం అర్బన్ : అసలే నిరుపేద కుటుంబం... రెక్కాడితే గాని డొక్కాడని జీవితం... రోజూ సాంప్రదాయ మత్స్యకారునిగా వేటకు వెళ్లడం... అది లేని సమయంలో ఇతర కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న నిరుపేద మత్స్యకారుడు యువకుడు బుధవారం మృత్యుపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురానికి చెందిన వమరవెల్లి రమణ (25) స్థానిక మెయిన్ రోడ్ సమీపంలోని వీధిలో కుటుంబ సభ్యులతో పాటు జీవనం సాగిస్తున్నాడు. చిన్న వయస్సులోనే కుటుంబ బాధ్యతలు సైతం తలకెత్తుకొని తోచిన రీతిలో సంపాదిస్తూ చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే సింగుపురం సమీపంలో గల పెద్ద గడ్డ కాలువ వద్దకు చేపల వేట కోసం వెళ్లిన రమణ అకస్మాత్తుగా అక్కడే కుప్పకూలడు. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని రమణ పరిస్థితిని గమనించారు. అప్పటికే మృతి చెందినట్లు స్థానిక వైద్యులు పేర్కొనడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు కన్నీరు మునిరై వినిపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న శ్రీకాకుళం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.

రైలు కిందపడి మహిళ...

పొందూరు: పొందూరు-దూసి రైల్వేస్టేషన్ల మధ్యన గోరింట సమీపంలో విశాఖ-పలాస ప్యాసెంజర్ రైలు కిందపడి బుధవారం గుర్తు తెలియన మహిళ (50) మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహం నుజ్జునుజ్జు అయిపోవడంతో గుర్తుపట్టలేని విధంగా ఉందని అన్నారు. మృతురాలు కుంకుమరంగు చీర కట్టుకుందని, సగం జుట్టుతో ఉన్నట్లు తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు ఈ కింది ఫోన్ నంబరు 7013273731ని సంప్రదించాలని అన్నారు.

యువకులపై దాడి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ఎం.తోటూరుకు చెందిన బోరుభద్ర వెంకటరావు, జగదీషకుమార్‌లపై ఎ.ఎస్.పేటకు చెందిన వ్యక్తులు దాడి చేయగా... వెంకటరావు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీ సులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరావు తన స్నేహితుడితో కలిసి బైకులపై సుమండి కూడలి వైపు వెళ్లారు. మరలా తిరిగి ఇచ్ఛాపురం వస్తుండగా ఎ.ఎస్.పేట చర్చి దగ్గరికి వచ్చేసరికి రోడ్డు మధ్యలో కొంతమంది గొడవ పడుతూ కనిపించారు. వారిని చూసి బైకును నిలుపుదల చేశారు. రోడ్డు మధ్యలో గొడవ ఏంటని వారిని వెంకటరావు, స్నేహితుడు ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తులైన ఎ.ఎస్.పేట గ్రామస్తులు ఉదయపురం మహేష్, నర్తు మేఘనాథం, నర్తు చిరంజీవులు, దట్టి భగీరధి, మరో వ్యక్తి కలిసి ఇద్దరిపై దాడి చేశారు. ఇందులో ఉదయపురం మహేష్ పదునైన బ్లేడుతో వెంకటరావు బుగ్గపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. జగదీష్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ ఎస్ఐ గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఆటో ఢీ : పలువురికి గాయాలు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు ఆలయం వద్ద విద్యార్థులతో వెళ్తున్న ఆటోను మరో ఆటో బుధవారం ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పారాపురం ఇమ్మనువెల్ స్కూల్ విద్యార్థులు ఐదుగురు, మెట్టూరు స్కూల్‌లో చదువుతున్న మరో ఐదురుగురు విద్యార్థులను ఒండ్రుజోలకు చెందిన ఆటో డ్రైవర్ గందవరపు రాజారావు తీసుకెళ్తున్నారు. ఈ సమయంలో శ్రీకాకుళం నుంచి వస్తున్న మరో ఆటో ఢీకొనడంతో ముందు వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సనపతి జ్యోతి, ప్రశాంత్, గొర్రెల నితిన్ తీవ్రంగా గాయపడ్డాడు. పొన్నాన షర్మిల, అరిగి త్రివేణి, గొడి నవీన్, సనపల వరుణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆటోలని చిన్నారులను బయటకు తీసి 108లో స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు టి.సుందరావు వైద్య సేవలందిస్తున్నారు. రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ

ప్రజాశక్తి- సోంపేట

ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని సోంపేట ఎస్ఐ బాలరాజు కాపాడారని సిఐ రవిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కార్యక్రమానికి బందోబస్తుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గంమధ్యలోని సోంపేట ఫ్లైఓవర్ వద్ద రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి పడుకుని ఆత్మహత్యకు పాల్పడుతుండాన్ని చూశారు. వెంటనే తన వాహనాన్ని నిలుపుదల చేసి రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని ఆ యువకుడిని అక్కడ నుంచి బయటకు తీసుకొచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి వివరాలు సేకరించారు. తాను పలాసకు చెందిన రవికుమార్ అని చెప్పారు. కుటుంబంలో కలహాల వల్ల ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలియజేశాడు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికుమార్‌తో మాట్లాడి క్షణికావేశానికి గురై జీవితాలను నాశనం చేసుకోవడం మంచిది కాదని కౌన్సెలింగ్ నిర్వహించారు. సమస్యలు ఎదుర్కొనేలా ప్రయత్నాలు చేయాలని సూచించారు. అతని స్నేహితుడి వివరాలు తెలుసుకొని ఫోన్ చేసి అనంతరం రవికుమార్‌ను అప్పగించారు.

ఒనేడు బైక్‌ల వేలం

సోంపేట : సోంపేటలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లుకార్యాలయ అధికారివెంకటప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన ఐదు ద్విచక్ర వాహనాలను వేస్తున్నామని అన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.వెయ్యి ధరావత్ చెల్లించి వేలం పాటలో పాల్గొవాలని కోరారు.

ఇచ్ఛాపురం : వినతిపత్రం అందజేస్తున్న విజయ

సిఎం దృష్టికి ప్రజా సమస్యలు

ఇచ్ఛాపురం : సంతబొమ్మాళి మండలంలోని రూ.4,362 కోట్ల వ్యయంతో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులకు సిఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు హెలిపాడ్‌వద్ద స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సోంపేట మండలంలోని బారువ నుంచి కొర్లాం వరకు, బారువ నుంచి కంచిలి వరకు, సోంపేట మెయిన్ రోడ్ విస్తరణకు నిధులు కేటాయించాలని కోరారు. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో నివసిస్తున్న బెంతో ఒరియాను ఎస్‌టి బెంతో ఒరియా కుల ధ్రువీకరణ పత్రాల జారీకి తగిన సూచనలను జారీ చేయాలని కోరారు. ప్రతిపాదిత 'కోకోనెట్ పార్కు-ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా సమీకృత కొబ్బరి ప్రాసెసింగ్ టెక్నాలజీపై ప్రదర్శన ఏర్పాటు, విలువ జోడింపు, ఉత్పత్తి వైవిధ్యీకరణ యూనిట్, ఒక జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. సోంపేట, కంచిలి, కవిటి మండల కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇచ్ఛాపురంలో పాలిటెక్నిక్ కళాశాల మంజూరుకు సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. కవిటి మండలం ఇద్దువానిపాలెంలో మత్స్యకారుల ప్రయోజనాల కోసం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలని విన్నవించారు.

సంతబొమ్మాళి మండలం మూలపేటకు సిఎం జగన్ వచ్చిన నేపథ్యంలో సీడాప్ చైర్మన్ సాడీ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని సాగునీటి పారుదల వ్యవస్థలను పునరుద్ధరించాలని కోరారు. ఆర్‌టిసి ఆధునికీకరణకు చర్యలు చేసుకోవాలన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులకు ప్రభుత్వం తరుపున ఉద్యోగార్థులకు, కంపెనీలకు మధ్యవర్తిగా లైజనింగ్ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు, ఐటిఐ, పట్టణంలో స్టేడియం నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ఇచ్ఛాపురం రైల్వే ట్రాక్ గేట వద్ద ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ వే, జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలోనూ అండర్ పాస్ వే నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అరకభద్ర వద్ద బహుదా నదిపై వంతెన నిర్మాణం పనులు వేగవంతం చేయాలని కోరారు.

నౌపడను మండలంగా ప్రకటించాలి

నౌపడ : నౌపడను ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని నౌపడ సర్పంచ్ పిలక బృందాదేవి రవికుమార్ రెడ్డి సిఎం జగన్‌ను కోరారు. సభ అనంతరం స్థానిక నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో నౌపడ పంచాయతీ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు పనిచేసే పది పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. పోర్టు నిర్మాణంతో ఉప్పు పరిశ్రమను నమ్ముకున్న వేలాది మంది జీవనాధారం కోల్పోయి నష్టపోతారని, వారికి మూలపేట పోర్టులో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ సౌకర్యం మెరుగుపరచాలని కోరారు. అలాగే నౌపడలో ఆర్అండ్ఆర్ కాలనీ, అప్రోచ్ రోడ్డు నిర్మాణాలకు భూములు ఇచ్చిన రైతులతో సీఎం మాట్లాడారు.

సభ వేదికపై మూలపేట సర్పంచ్ జీరు బాబూరావు, జీరు రాంబాబు, దారపు అప్పల రెడ్డి సిఎం జగన్‌ను కలిసి దుశ్శాలువతో సన్మానించారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తుల తరపున జ్ఞాపిక అందజేశారు. భూ సేకరణ, పరిహార చెల్లింపు విషయమై మంత్రి అప్పలరాజు కృషి మర్చిపోలేమని సిఎం వద్ద ప్రస్తావించారు.

ఆమదాలవలస : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం టెక్కలి నియోజకవర్గంలోని మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు శంకుస్థాపనకు విచేశారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఎంకు వైసిపి నాయకులు సువ్వారి గాంధీ వినతిపత్రాన్ని అందించారు. నియోజకవర్గంలోని బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను మంజూరు చేయాలని కోరారు. అలాగే బూర్జ మండలాన్ని పాలకొండ విద్యుత్‌శాఖ డివిజన్ నుంచి శ్రీకాకుళం డివిజన్‌కు మార్చాలని విన్నవించారు. బూర్జ ఓపెన్ హెడ్ ఛానల్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల అనుమతులకు సంబంధించి సుడా పరిధి నుంచి తప్పించి గ్రామ పంచాయతీలకు అనుమతులు ఇచ్చేలా ఉత్తర్వులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై సిఎం సానుకూలంగా స్పందించారని గాంధీ తెలిపారు.

నౌపడ : సిఎంకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

కొబ్బరి పార్కు ఏర్పాటు చేయాలని వినతి

కవిటి: ఉద్దానం ప్రాంతంలో సుమారు 90 శాతం ప్రజలు కొబ్బరి పంటపై ఆధారపడి జీవిస్తున్నారని, కానీ ప్రకృతి విపత్తులు, దళారీల దోపిడీతో కొబ్బరి రైతు పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని సిఎం దృష్టికి ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ తీసుకెళ్లారు. కొబ్బరి సాగు, పంట దిగుబడి, రైతుల శ్రేయస్సుని దష్టిలో ఉంచుకుని కవిటి మండలంలో కొబ్బరి పార్కు ఏర్పాటు చేయాలని కోరారు.



కవిటి : వినతిపత్రం అందజేస్తున్న ప్రకాష్

ఆమదాలవలస : పుష్పగుచ్ఛం అందజేస్తున్న గాంధీ



ఇచ్ఛాపురం : సిఎంకు వివరిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

సిఎం జగన్ పర్యటన దృశ్యమాలిక



ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

కవిటి : మండలంలోని బెలగాంలో ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బపై అవగాహన డాక్టర్ పి.రాకేష్, హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ బుధవారం అవగాహన కల్పించారు. ఎండలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైతే చేయాల్సిన ప్రాథమిక చికిత్స గురించి వివరించారు. అలాగే ప్రతి వ్యక్తి రోజూ తీసుకోవాల్సిన నీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్ల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను సర్పంచ్ ఎం.ఈశ్వరరావు అందించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎం.కృష్ణారావు, ఆశా కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ తప్పనిసరి

ఆమదాలవలస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు లోబడి గడచిన పదేళ్లలో ఆధార్‌ను నవీకరించుకోని వారు వ్యక్తిగత, బయోమెట్రిక్ వివరాలను తప్పనిసరిగా నవీకరించుకోవాలని మున్సిపల్ కమిషనరు ఎం.రవిసుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను పట్టణ పరిధిలోని లక్ష్ముడుపేట, గేటు వార్డు సచివాలయంలోని ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్ వివరాలు నవీకరించుకోకపోతే ఏక్షణంలోనైనా ఆధార్ సంబంధిత అన్ని పౌర సేవలతోపాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ఆధార్ నవీకరణ విషయంలో నిర్లిప్తత వీడాలని పిలుపునిచ్చారు. ఆధార్ నవీకరణకు వ్యక్తిగత హాజరుతో పాటు ప్రస్తుత చిరునామాను ధ్రువీకరించే ఏదేని గుర్తింపు పత్రంతో సంప్రదించి, నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

విశ్వనాథం చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న వీర్రాజు

సోము వీర్రాజు పరామర్శ

పలాస : మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు బుధవారం విశ్వనాథం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా విశ్వనాథం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు కుమార్తె శారద, కుమారుడు రాజేంద్ర, అల్లుడు, బిజెపి నాయకులు కొర్ల కన్నారావు, పాలవలస వైకుంఠరావు, కొర్రాయి బాలకృష్ణ ఉన్నారు.

వేడిగాలులపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వేసవి కాలం పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, గ్రామాల్లో పొలం, ఉపాధి పనులకు రైతులకు, కూలీలకు వడదెబ్బలపై అవగాహన కల్పించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరీ అత్యవసరమైతే తప్ప పగలు 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల మధ్యలో ప్రయాణాలు చేయవద్దని అన్నారు. తప్పనిసరి అయితే వెంట తాగునీటిని తీసుకెళ్లాలన్నారు. రైతులు, గొర్రెలు, పశువుల కాపరులు మిట్ట మధ్యాహ్నం చెట్ల నీడకు చేరుకోవాలన్నారు. ఎండ

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

తీవ్రత వల్ల వడదెబ్బ తగిలే పరిస్థితులు ఉన్నందున మజ్జిగ, తాగునీరు, గ్లూకోస్, కొబ్బరినీళ్ల వాడడంతో పాటు వైద్యుల సలహాలను తప్పక పాటించాలని వివరించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు ధనలక్ష్మి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, అకౌంటెంట్ కళ్యాణి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం అర్బన్ : జెసిఐ శ్రీకాకుళం సన్ రైజర్స్, జూహిత్ నందన్ కృష్ణ ట్రస్టు సంయుక్తంగా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రయాణికులకు, నగర వాసులకు దాహార్తి తీర్చడానికి ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ముందుగా దీనిని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేష్ ప్రారంభించారు. వారం రోజులుగా వేసవి తీవ్రత అధికంగా ఉందని, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ప్రధాన కూడళ్ల వద్ద మజ్జిగ, తాగునీరు అందించాలని కోరారు. వేసవి తీవ్రత వల్ల వడ దెబ్బకు గురి కాకుండా సకాలంలో తాగునీరు, మజ్జిగ తాగడం శ్రేయస్కరమని అన్నారు. పనిప్రదేశాల్లోనూ తాగునీరు ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెసిఐ ప్రెసిడెంట్ డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ గీతాశ్రీకాంత్, న్యాయవాది మురళీమోహన్ పాల్గొన్నారు.

వైన్‌షాపుల తనిఖీ

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నాలుగు ప్రభుత్వ వైన్ షాపులను ఎక్సైజ్ సిఐ సూర్య కుమారి బుధవారం తనిఖీలు చేపట్టారు. మద్యం అమ్మకాల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మద్యం, అమ్మకాలు సరిపడేలా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం భగవతి థియేటర్ సమీపంలో దుకాణంలో ఉన్న మద్యం సీసాలను వేరే షాపుకు మార్చాలని సిబ్బందికి

వైన్ షాపును పరిశీలిస్తున్న సిఐ సూర్యకుమారి

ఆదేశించారు. ఆమెతో పాటు ఎక్సైజ్ ఎస్ఐ రాజేశ్వరి, హెచ్.సి.కుమార్, కృష్ణ ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

కొత్తూరు : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రణస్థలం రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సూర్య ఆస్పత్రి వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ అవగాహన కల్పించారు. పొరపాటున అగ్ని ప్రమాదం వాటిల్లితే ఎలా స్పందించాలో డెమో నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.పోలినాయుడు, ఉరిటి రవికుమార్, రామ్‌లక్ష్మణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద అగ్నిమాపక అధికారి జి.రమణమూర్తి, సిబ్బంది అగ్నిమాపక యంత్రాల ద్వారా అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై డెమో నిర్వహించారు.

విశాఖలో కాపురం పెడితే రాజధాని అవుతుందా?

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పి.ఎం.జె బాబు

ఒకే అబద్ధాన్ని పదేపదే చెప్పి ప్రజలను నమ్మించడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని, కేవలం సిబిఐ విచారణ ఆలోచన నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి మళ్లీ విశాఖ రాజధాని అని పాతపాట పాడుతున్నారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు వ్యాఖ్యానించారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉగాదికే విశాఖకు వెళ్లిపోతానని చెప్పిన జగన్... ఇప్పుడు మూలపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మళ్లీ సెప్టెంబరులో మకాం మారుస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందనానరు. ఆయన మకాం మార్చినంత మాత్రాన రాజధాని అయిపోతుందా? అని ప్రశ్నించారు. ఈ మాటలను ప్రజలు విశ్వసించే రోజులు గడచిపోయాయని, రానున్న రోజుల్లో ఓటమి తప్పదన్న భయం వైసిపిని వెంటాడుతోందని అన్నారు.

జనసేన మండల అధ్యక్షులుగా విశ్వేశ్వరరావు

విశ్వేశ్వరరావు

బూర్జ : జనసేన పార్టీ మండల అధ్యక్షునిగా కొత్తకోట విశ్వేశ్వరరావు (నాగేంద్ర) ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఎంపిక చేశారు. ఈ మేరకు బుధవారం తోటవాడలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం దినోత్సవం ఎన్నో సేవలు చేశానని అన్నారు. తన సేవలను గుర్తించి పార్టీ గుర్తించిందని అన్నారు. నిత్యం ప్రజల పక్షాన ఉంటూ జనసేన పార్టీ తరఫున ప్రజల కోసం పోరాటం చేస్తానని అన్నారు.

పేద మహిలకు 'అన్నవరం' అండ

కవిటి : మండలంలోని బల్లిపుట్టుగకు చెందిన బచ్చల కళావతికి అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అండగా నిలిచింది. రెక్కాడితే గాని డొక్కాడని కళావతి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్, సీతయ్య ఫౌండేషన్ సభ్యులు బుధవారం గ్రామానికి చేరుకుని రూ.3,200 నగదుతో పాటు బియ్యం బస్తాను అందించారు. కార్యక్రమంలో అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గోపి బిసాయి, సిద్దు మజ్జి, ఓంకార్ మజ్జి, లలిత బిసాయి, సునీత రౌలో, తెలుకుల సంగీత, ధనుంజయ, నర్సింగ్, చంటి, శ్రీధర్, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న సంస్థ సభ్యులు